భాజనీయత సూత్రాలు

ఏదైనా ఒక సంఖ్యను మరో సంఖ్యతో భాగిం చకుండా, ఆ సంఖ్య ఏ సంఖ్యలచేత నిశ్శేషంగా భాగిస్తుందో లేదా ఏ సంఖ్యచేత నిశ్శేషంగా భాగించదో తెలుసుకోవడానికి ఉపయోగించే సూత్రాలే ''భాజనీయత సూత్రాలు''. వీటిని తెలుసుకోవడం వల్ల ఇచ్చిన సంఖ్య పలానా సంఖ్య ద్వారా భాగిస్తుందో లేదో చూడగానే చెప్పవచ్చు. ఈ సూత్రాలను పరిశీలిద్దాం.

'2' భాజనీయత సూత్రం

సరిసంఖ్యలన్నీ '2'తో నిశ్శేషంగా భాగించవచ్చు. లేదా ఒక సంఖ్యలోని ఒకట్ల స్థానంలో 0, 2, 4, 6, 8లలో ఏదోఒకటి ఉంటే అది '2'తో నిశ్శేషంగా భాగించవచ్చు. ఉదా : 7374 – ఒకట్ల స్థానంలో '4' ఉంది. కాబట్టి దీనిని '2'తో భాగించవచ్చు. 5879 – ఒకట్ల స్థానంలో 0, 2, 4, 6, 8 ల్లో ఏ సంఖ్యా లేదు కాబట్టి దీనిని '2'తో భాగించలేం.

'3' భాజనీయత సూత్రం

ఒక సంఖ్యలోని అంకెల మొత్తం '3'తో భాగిస్తే ఆ సంఖ్యని '3'చేత నిశ్శేషంగా భాగించవచ్చు.
ఉదా : 4761– ఈ సంఖ్యలోని అంకెల మొత్తం = 4 + 7 + 6 + 1 = 18. '18' ని'3'తో నిశ్శేషంగా భాగించవచ్చు. కాబట్టి 4761ని '3'తో నిశ్శేషంగా భాగించవచ్చు. 6374 – ఈ సంఖ్యలోని అంకెల మొత్తం = 6 + 3 + 7 + 4 = 20. '20'ని '3'తో భాగించలేం. కాబట్టి 6374ని '3'చేత నిశ్శేషంగా భాగించలేం.

'4' భాజనీయత సూత్రం

ఒక సంఖ్యలోని పదులు, ఒకట్ల స్థానాలలో రెండు సున్నాలు ఉన్నా లేదా పదుల, ఒకట్ల స్థానాలలో ఉన్న సంఖ్య '4'తో భాగింపబడితే, ఆ సంఖ్యని '4'తో నిశ్శేషంగా భాగించవచ్చు.
ఉదా : 87600 – ఈ సంఖ్యలో చివరి రెండు స్థానాలలో రెండు సున్నాలు ఉన్నాయి. కాబట్టి ఈ సంఖ్యని '4'తో నిశ్శేషంగా భాగించవచ్చు. 7936 – ఈ సంఖ్యలోని చివరి రెండు స్థానాలలో ఉన్న సంఖ్య '36'. 36ని 4తో నిశ్శేషంగా భాగించవచ్చు. కాబట్టి '7936'ని కూడా '4'తో నిశ్శేషంగా భాగింవచ్చు. 84721 – ఈ సంఖ్యలోని చివరి రెండు స్థానాలలో ఉన్న సంఖ్య '21'. 21ని 4తో నిశ్శేషంగా భాగించలేం. కాబట్టి 84721ని కూడా '4'చేత భాగించలేం.

'5' భాజనీయత సూత్రం

ఒక సంఖ్యలోని ఒకట్ల స్థానంలో '0' గానీ, '5'గానీ ఉంటే ఆ సంఖ్యని '5'తో నిశ్శేషంగా భాగించవచ్చు. ఉదా : 47350, 63465 ఈ రెండు సంఖ్యలలో ఒకట్ల స్థానాలలో వరుసగా '0', '5'లు ఉన్నాయి. కాబట్టి ఈ రెండు సంఖ్యలను '5'తో నిశ్శేషంగా భాగించవచ్చు. 64728 – ఈ సంఖ్యలో ఒకట్ల స్థానంలో '0' గానీ, '5' గానీ లేదు. కాబట్టి ఈ సంఖ్యని '5'తో నిశ్శేషంగా భాగించలేం.

'6' భాజనీయత సూత్రం

'6'కు ప్రత్యేకంగా భాజనీయత సూత్రం లేదు. కానీ '6'ను 2 × 3గా రాయొచ్చు. అంటే ఒక సంఖ్య '2', '3'తో భాగింపబడినట్లయితే ఆ సంఖ్యని '6'తో కూడా నిశ్శేషంగా భాగించవచ్చు. లేదా ఒక సంఖ్యలోని ఒకట్ల స్థానంలో 0, 2, 4, 6, 8లలో ఏదో ఒకటి ఉంటూ, ఆ సంఖ్యలోని అంకెల మొత్తం '3'తో భాగింపబడినట్లయితే, ఆ సంఖ్యని'6'తో కూడా నిశ్శేషంగా భాగించవచ్చు. ఉదా : 8472 – ఈ సంఖ్యలో ఒకట్ల స్థానంలో '2' ఉంది కాబట్టి ఈ సంఖ్యని '2'తో నిశ్శేషంగా భాగించవచ్చు. ఈ సంఖ్యలోని అంకెల మొత్తం = 8 + 4 + 7 + 2 = 21. 21ని '3'తో నిశ్శేషంగా భాగించవచ్చు. కాబట్టి ఈ సంఖ్యని '3'తో కూడా నిశ్శేషంగా భాగించవచ్చు. 8472 అనే సంఖ్యను 2, 3తో భాగించవచ్చు. కాబట్టి 6తో కూడా భాగించవచ్చు.

'8' భాజనీయత సూత్రం

ఒక సంఖ్య చివరి మూడు స్థానాలలో మూడు సున్నాలు ఉన్నా, లేదా చివరి మూడు స్థానాలలో ఉన్న సంఖ్య 8చేత భాగించబడినా ఆ సంఖ్యని 8 చేత నిశ్శేషంగా భాగించవచ్చు.

ఉదా : 567000 – చివర మూడు సున్నాలు ఉన్నాయి. కాబట్టి ఈ సంఖ్యని 8తో నిశ్శేషంగా భాగించవచ్చు.

46752 – చివరి మూడు స్థానాలలో ఉన్న సంఖ్యని '8'తో భాగించవచ్చు. కాబట్టి ఈ సంఖ్యని కూడా '8'చేత నిశ్శేషంగా భాగించ వచ్చు.

'9' భాజనీయత సూత్రం

ఒక సంఖ్యలోని అంకెల మొత్తం '9'చేత భాగించబడినట్లయితే, ఆ సంఖ్యని కూడా '9'చేత నిశ్శేషంగా భాగించవచ్చు. ఉదా : 421758 ఈ సంఖ్యలోని అంకెల మొత్తం = 4 + 2 + 1 + 7 + 5 + 8 = 27. 27 ని'9'తో నిశ్శేషంగా భాగించ వచ్చు. కాబట్టి ఈ సంఖ్యను కూడా '9' చేత నిశ్శేషంగా భాగించవచ్చు.

'10' భాజనీయత సూత్రం

ఒక సంఖ్యలోని ఒకట్ల స్థానంలో '0' ఉన్నప్పుడు మాత్రమే ఆ సంఖ్యని 10తో నిశ్శేషంగా భాగించ వచ్చు.

ఉదా : 4320 – ఈ సంఖ్య ఒకట్ల స్థానంలో '0' ఉంది. కాబట్టి ఈ సంఖ్యను '10'తో నిశ్శేషంగా భాగించవచ్చు.

ఈ భాజనీయత సూత్రాలు మెంటల్ ఎబిలిటీలో సంఖ్య ఆధారిత ప్రశ్నల సాధనలో ఉపయోగపడతాయి. ఉదాహరణకు నంబర్ క్లాసి ఫికేషన్‌లో ఐదు సంఖ్యలిచ్చి వేరుగా ఉన్నదానిని గుర్తించమని అడుగుతారు. అందులో నాలుగు సంఖ్యలు ఒక సంఖ్యచేత భాగించబడి, ఒకటి వేరుగా ఉండవచ్చు. ఇలాంటి సందర్భాలలో ఈ సూత్రాలు ఉపయోగపడతాయి.